క్లుప్తంగా

మూఢ నమ్మకాలతో భవిష్యత్ అంధకారం: ఎస్ఐ

వెల్దుర్తి(తూప్రాన్): మూఢ నమ్మకాలతో భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని ఎస్ఐ రాజు, సైంటిఫిక్ స్టూడెంట్ ఫెడరేషన్ జాతీయ కమిటీ సభ్యుడు ఉప్పులేటి నరేశ్ అన్నారు. మంగళవారం ఎస్పీ ఆదేశాలతో కేజీబీవీ, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వ్యక్తిత్వ వికాసం–సైన్స్–మూఢనమ్మకాల నిర్మూలన అనే అంశంపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. మూఢనమ్మకాలు లేని శాస్త్రీయ సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషిచేయాలని కోరారు. యువత మత్తు, మద్యానికి బానిసై జీవితాలను అంధకారం చేసుకోవద్దని సూచించారు.

పుస్తకాల పంపిణీ



పుస్తకాలు అందజేస్తున్న ఎంఈఓ

రేగోడ్(మెదక్): మండల కేంద్రం రేగోడ్‌లోని ఎమ్మార్సీ కార్యాలయంలో మంగళవారం నూతన ఉపాధ్యాయులకు ఎంఈఓ గుర్నాథ్ సర్వీస్ పుస్తకాలు, ఎంప్లాయిస్ ఐడీ కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు అంజిబాబు మాట్లాడారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ మండల బాధ్యులు సంజీవులు, రమేశ్, అల్లాదుర్గం మండలాధ్యక్షుడు జనార్దన్, నూతన ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హుండీ లెక్కింపు

శివ్వంపేట(నర్సాపూర్): ఉమ్మడి జిల్లాలో ప్రసిద్ధి చెందిన చాకరిమెట్ల సహకార ఆంజనేయస్వామి ఆలయ హుండీని మంగళవారం లెక్కించారు. ఏడు నెలలకు సంబంధించి హుండీ ఆదాయం రూ.లక్ష 37 వేల 76 వచ్చినట్లు ఆలయ ఈఓ శశిధర్‌గుప్తా తెలిపారు. ఈ కార్యక్రమంలో మెదక్ జిల్లా దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ రంగారావు, ప్రధాన అర్చకుడు ధనుంజయ్‌శర్మ, జూనియర్ సహాయకుడు నర్సింహరెడ్డి, సిబ్బంది, గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.

పదిలో ఉత్తమ ఫలితాలు సాధించాలి

వెల్దుర్తి(తూప్రాన్): పదో తరగతి వార్షిక పరీక్షలు దగ్గర పడుతున్నందున విద్యార్థులు శ్రద్ధగా చదువుకొని ఉత్తమ ఫలితాలు సాధించాలని రాష్ట్ర అకాడమిక్ పర్యవేక్షణ అధికారి వెంకటస్వామి సూచించారు. ఈ మేరకు వెల్దుర్తి ఉన్నత పాఠశాలను సందర్శించి విద్యార్థులు, ఉపాధ్యాయులకు పలు సలహాలు, సూచనలు అందజేశారు. పరీక్షలు ముగిసేవరకు ప్రతిరోజు ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రణాళికతో చదవాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్‌ఎం సాంబయ్య, ఉపాధ్యాయులు వెంకటస్వామి, శ్రీనివాసరావు, నర్సింహరెడ్డి, జయసుధ, శైలజ పాల్గొన్నారు.

గ్రంథాలయం ప్రారంభం

చేగుంట(తూప్రాన్): పులిగుట్ట తండా ప్రాథమిక పాఠశాలలో మంగళవారం మాసాయిపేట ఎంఈఓ లీలావతి వెల్దుర్తి ఎంఈఓ యాదగిరి పుస్తకమిత్ర గ్రంథాలయం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఈఓ లీలావతి మాట్లాడుతూ.. జీఎంఆర్ సంస్థ ప్రతిపాదనలతో పాఠశాలకు రూ.30 వేల విలువైన పుస్తకాలను ప్రవాస భారతీయ వాసవీ సంఘం అందించడం అభినందనీయమన్నారు. కాంప్లెక్స్ హెచ్‌ఎంలు ధర్మపురి, నవీన్, జీఎంఆర్ ఫౌండేషన్ కోఆర్డినేటర్ శ్రీనివాస్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన

చేగుంట(తూప్రాన్): మండల కేంద్రం చేగుంట ప్రభుత్వ జూనియర్ కళాశాల కంప్యూటర్ సైన్స్ విద్యార్థులకు ఎంపీడీఓ కార్యాలయంలో ఆన్‌జాబ్ ట్రెనింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం నిర్వహిస్తున్న కులగణన సర్వే వివరాలను కంప్యూటర్‌లో పొందుపరుస్తున్న తీరును విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో కంప్యూటర్ సైన్స్ లెక్చరర్లు లక్ష్మణ్, ప్రమోద్‌కుమార్ ఉన్నారు.

టిప్పర్ల పట్టివేత

రామాయంపేట(మెదక్): అక్రమంగా మొరం తరలిస్తున్న రెండు టిప్పర్లను సోమవారం రాత్రి పట్టణ శివారులో రెవెన్యూ అధికారులు పట్టుకున్నారు. 1421 సర్వే నంబర్‌లో అక్రమంగా మొరం తవ్వకాలు జరుపుతున్నట్లు తమకు సమాచారం అందగా, తాము వెళ్లి టిప్పర్లను స్వాధీనపర్చుకున్నట్లు తహసీల్దార్ రజని కుమారి తెలిపారు. పట్టుబడ్డ టిప్పర్లను పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ మేరకు టిప్పర్లకు జరిమానా విధించినట్లు చెప్పారు.

సమయపాలన పాటించాలి

మనోహరాబాద్(తూప్రాన్): ఉపాధ్యాయులు తమ విధుల్లో సమయపాలన తప్పకుండా పాటించాలని ఎంఈఓ మల్లేశం అన్నారు. మంగళవారం ఆయన మండలంలోని రామాయపల్లి ఉన్నత పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులతో మాట్లాడారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడారు. ఎంఈఓ మల్లేశంను మండల బీఆర్‌ఎస్ నాయకులు రతన్‌లాల్, యూత్ అధ్యక్షుడు లక్ష్మణ్ సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, తదితరులున్నారు.

యథేచ్ఛగా ఎర్రమట్టి రవాణా

చోద్యం చూస్తున్న అధికారులు



హన్మంతాపూర్ పెద్దచెరువు శిఖంలో మట్టి తవ్వుతున్న హిటాచి



మొరంను తరలిస్తున్న టిప్పర్

నర్సాపూర్: మున్సిపాలిటీ పరిధిలోని హన్మంతాపూర్ నుంచి కొంత కాలంగా ఎర్రని, నల్లమట్టిని ఇతర ప్రాంతాలకు అక్రమంగా తరలిస్తున్నారు. హన్మంతాపూర్‌లోని ప్రభుత్వ భూములు, అటవీ భూములు, చెరువు శిఖం, అసైన్డ్ భూములను అక్రమమట్టి వ్యాపారులు తమ వ్యాపారాలకు అడ్డాగా మార్చుకున్నారు. ఆయా శాఖల అధికారులు, సిబ్బంది అండతో ఎర్రమొరం, మట్టిని యథేచ్ఛగా తవ్వి తరలిస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి. సెప్టెంబరు నెలలో అసైన్డ్‌మెంట్ భూముల నుంచి మట్టిని తరలించారు. కాగా ఇటీవల అసైన్డ్ భూములతో పాటు వాటిని ఆనుకొని ఉన్న అటవీ భూముల నుంచి మట్టి తవ్వి తరలించారు.

హన్మంతాపూర్ నుంచి చిన్నగొట్టిముక్కుల ఫాంహౌజ్‌లకు..

తాజాగా నాలుగైదు రోజుల నుంచి హన్మంతాపూర్ పెద్ద చెరువు శిఖంతో పాటు దానిని ఆనుకొని ఉన్న ప్రభుత్వ భూముల నుంచి హిటాచీతో మట్టిని తవ్వి టిప్పర్ల ద్వారా శివ్వంపేట మండలంలోని చిన్న గొట్టిముక్కుల గ్రామంలోని ఫాంహౌజ్‌లకు తరలిస్తున్నారు. నాలుగైదు రోజుల నుంచి చెరువు శిఖంలో తవ్వకాలు జరిపి మట్టిని అక్రమంగా రవాణా చేస్తున్నా.. ఏ శాఖ అధికారులు చర్యలు తీసుకోకపోవడం గమనార్హం. మొరం తవ్వి తరలించడంతో అక్కడి గుట్ట కనుమరుగవుతోంది. పట్టణంలోని శ్రీలక్ష్మీనారాయణస్వామి ఆలయ భూముల నుంచి సైతం రాత్రిపూట మట్టిని తవ్వి తరలిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు.

ఫొటోలు తీయగానే నిలిపివేసిన తవ్వకాలు

హన్మంతాపూర్ చెరువు శిఖంలో మంగళవారం తవ్వకాలు జరుగుతున్నాయని తెలిసి పలువురు విలేకరులు అక్కడికి వెళ్లి ఫొటోలు, వీడియోలు తీయడంతో పాటు మండల తహసీల్దార్ శ్రీనివాస్‌కు వివరణ కోసం ఫోన్ చేశారు. విలేకరులు ఫొటోలు, వీడియోలు తీయగానే మట్టి అక్రమ వ్యాపారులు తవ్వకాలను నిలిపివేశారని తెలిసింది. హన్మంతాపూర్ పెద్ద చెరువు శిఖం నుంచి అక్రమంగా మట్టి తవ్వి తరలిస్తున్న విషయమై తహసీల్దార్ శ్రీనివాస్‌ను వివరణ కోరగా.. తమ ఆర్ఐ ఫైజల్‌ను పంపి విచారణ చేయిస్తానని చెప్పి ఆర్ఐని విచారణకు పంపారు. అనంతరం ఆర్ఐ ఫైజల్ మాట్లాడుతూ.. తాను అక్కడికి వెళ్లేసరికి హిటాచి, టిప్పర్లు లేవని చెప్పారు. కాగా తవ్వకాలు జరిపిన, టిప్పర్లు తిరిగిన ఆనవాళ్లు ఉన్నాయని, వాహనాలు అక్కడ లేవని తెలిపారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల అందజేత



నర్సాపూర్‌లో చెక్కులు అందిస్తున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

నర్సాపూర్: సీఎం రిలీఫ్ ఫండ్ పథకంతో పేదలకు మేలు జరుగుతుందని ఎమ్మెల్యే సునీతారెడ్డి చెప్పారు. మంగళవారం పట్టణంలోని తన క్యాంపు కార్యాలయంలో సుమారు పది మంది లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. నర్సాపూర్‌కు చెందిన తుకారాంతండా చెందిన మోహన్, లక్ష్మి, నందాని, మండలంలోని ఇబ్రహీంబాద్‌కు చెందిన మొగులయ్య, లక్ష్మయ్య, రుస్తుంపేటకు చెందిన బాలమణి, రమేశ్, శివ్వంపేట మండలం గొట్టిముక్కులకు చెందిన ప్రభాకర్ తదితరులకు చెక్కులు అందజేశారు. ఆమె వెంట నర్సాపూర్ మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్, వైస్ చైర్మన్ నయిమోద్దీన్, బీఆర్‌ఎస్ నాయకులు సత్యంగౌడ్, జితేందర్ రెడ్డి, ప్రసాద్ తదితరులు ఉన్నారు.

'మాల మహానాడు బలోపేతానికి కృషి'

నర్సాపూర్: జిల్లాలో మాల మహానాడు బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని జిల్లా మాల మహానాడు అధ్యక్షుడిగా నియమితులైన రాజేందర్ అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ... హైదరాబాద్‌లో జరిగిన మాల మహానాడులో తనను మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు చెన్నయ్య జిల్లా అధ్యక్షుడిగా నియమించి ఉత్తర్వులు అందజేశారని చెప్పారు. తనను జిల్లా అధ్యక్షుడిగా నియమించిన నాయకులందరికి ఆయన ధన్యవాదాలు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

తూప్రాన్: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి దుర్మరణం చెందిన ఘటన పట్టణ సమీపంలోని బైపాస్ మార్గంలో 44వ జాతీయ రహదారిపై నర్సాపూర్ వంతెన వద్ద మంగళవారం చోటు చేసుకుంది. ఎస్ఐ శివానందం కథనం మేరకు.. దుబ్బాక మండలం రాజక్కపేటకు చెందిన రాజోలు(42) బైక్‌పై హైదరాబాద్ వైపు నుంచి తూప్రాన్‌కు వస్తున్నాడు. ప్రమాదవశాత్తు బైక్ అదుపుతప్పి రహదారి పక్కన ఉన్న ఇనుప చువ్వలను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు.

అప్రమత్తంగా ఉండాలి

శివ్వంపేట(నర్సాపూర్): క్యాన్సర్‌పై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఫ్లెమింగ్ లేబొరేటరీస్ హెడ్ హెచ్‌ఆర్ మనోహర్ అన్నారు. మండల పరిధిలోని నవాబుపేట గ్రామంలో మంగళవారం మహిళలకు ఉచితంగా క్యాన్సర్‌పై అవగాహన, వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఫ్లెమింగ్ లేబొరేటరీస్ లిమిటెడ్ వారి సౌజన్యంతో బసవతారకం ఇండో– అమెరికన్ క్యాన్సర్ ఆస్పత్రి, రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ హైదరాబాదు వారి సహకారంతో క్యాన్సర్‌పై వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యులు నాగప్రశాంతి, సులోచనరాణి, ప్రదీప్‌రెడ్డి, ఫ్లెమింగ్ పరిశ్రమ క్వాలిటీ హెడ్ శ్రీనివాస్‌రావు, యూనిట్ హెచ్‌ఆర్ రాజేంద్ర, గ్రామస్తులు పాల్గొన్నారు.



వైద్య పరీక్షలు చేయించుకుంటున్న గ్రామస్తులు

బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలి



ఏబీవీపీ కార్యకర్తల రాస్తారోకో

రామాయంపేటలో రాస్తారోకో నిర్వహిస్తున్న ఏబీవీపీ కార్యకర్తలు

రామాయంపేట(మెదక్): బాసర ట్రిపుల్ ఐటీలో ఆత్మహత్యకు పాల్పడ్డ విద్యార్థిని స్వాతి ప్రియ కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ ఏబీవీపీ కార్యకర్తలు మంగళవారం రామాయంపేటలో రాస్తారోకో నిర్వహించారు. పరామర్శకు వెళ్లిన తమ సంఘం కార్యకర్తలు, నాయకులపై విచక్షణా రహితంగా దాడి చేశారని సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ప్రశాంత్ ఆరోపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కళాశాలలో ఇప్పటికే చాలా మంది విద్యార్థులు ఆత్మహత్యకు పాల్పడ్డా.. ప్రభుత్వం మాత్రం స్పందించడం లేదని ఆరోపించారు. విద్యార్థుల ఆత్మహత్యలకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని, బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలన్నారు. అనంతరం కార్యకర్తలు ప్రభుత్వ దిష్టిబొమ్మను దగ్ధం చేసి నిరసన వ్యక్తం చేశారు. ఆందోళనలో సంఘం నగర కార్యదర్శి హరి, సంయుక్త కార్యదర్శి అర్జున్, ఇతర నాయకులు పాల్గొన్నారు.

రాజిపేటలో భగీరథ నీటి పరిశీలన



రాజిపేటలో గ్రామస్తులను అడిగి తెలుసుకుంటున్న డీఈఈ సంపత్, ఏఈ అన్వేష్.

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని రాజిపేటలో మిషన్ భగీరథ నీటిని, పైప్‌లైన్‌ను డీఈఈ సంపత్, ఏఈ అన్వేష్, పంచాయతీ కార్యదర్శి నిర్మల పరిశీలించారు. మంగళవారం సాక్షి దినపత్రికలో మంచి నీటిలో పురుగులు అనే శీర్షికతో కథనం ప్రచురితమైంది. దీంతో అధికారులు స్పందించారు. ఈ సందర్భంగా అధికారులు నీటిలో పురుగులు వచ్చిన ఇంటికి వెళ్లి పరిసరాలను, వాటర్ ట్యాంక్, పైప్‌లైన్‌ను పరిశీలించారు. రక్షిత మంచినీటి పథకం ట్యాంక్‌ను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని ఆపరేటర్‌ను ఆదేశించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. గ్రామస్తులు సైతం నల్లాల వద్ద ఎలాంటి మురికి, చెత్తతో పాటు నీటి గుంతలు, పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. మిషన్ భగీరథ ద్వారా శుభ్రమైన మంచినీటిని సరఫరా చేస్తున్నామని గ్రామస్తులు ఆందోళన చెందొద్దని తెలిపారు.

సంక్షిప్త వార్తలు

◆ రాజిరెడ్డిని పరామర్శించిన ఎమ్మెల్యే

వెల్దుర్తి(తూప్రాన్): టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఆవుల రాజిరెడ్డి నాయనమ్మ రామమ్మ(92) ఇటీవల మృతి చెందారు. దీంతో ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి మంగళవారం మాసాయిపేటలో రాజిరెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఎమ్మెల్యే వెంట బీఆర్‌ఎస్ నాయకులు నర్సింలు, శ్రీనివాస్‌నాయక్, సత్యంగౌడ్, నాగరాజు, మధుసూదన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

◆ ఆర్థికసాయం అందజేత

నర్సాపూర్: పట్టణానికి చెందిన విద్యార్థినికి బీజేపీ నాయకురాలు మంగళవారం ఆర్థిక సాయం అందజేశారు. నర్సాపూర్‌కు చెందిన సిమ్రాన్ సామాఖనం ఎంఎన్‌ఆర్ కాలేజీ ఆఫ్ ఫార్మసీ కాలేజీలో ఫార్మసి సీటు పొందగా, ఆమెకు బీజేపీ నాయకురాలు కవిత రూ.20వేలను అందచేశారు.

◆ పదో తరగతి విద్యార్థులకు ఫీజు చెల్లింపు

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని ధరిపల్లి జెడ్పీపాఠశాల 10వ తరగతి విద్యార్థులకు వార్షిక పరీక్షల ఫీజును హైదరాబాద్‌కు చెందిన హర్ట్ టూ హెల్ప్ చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధులు చెల్లించారు. మంగళవారం ధరిపల్లి జెడ్పీపాఠశాలలోని 36 మందికి సంబంధించిన పరీక్ష ఫీజు రూ.4500 దాత పేరుమళ్ల వెంకటలక్ష్మి సహకారంతో చెల్లించినట్లు ట్రస్ట్ అధ్యక్షుడు రవి తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం రమేశ్‌చౌదరి ఉన్నారు.

◆ మత్స్య కార్మికుల శ్రేయస్సు కోసం కృషి

రామాయంపేట(మెదక్): ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు మంగళవారం మల్లె చెరువులో చేప పిల్లలను వదిలారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మత్స్య కార్మికుల శ్రేయస్సు కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, ముదిరాజ్ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

◆ సన్మానం

వెల్దుర్తి(తూప్రాన్): మాసాయిపేట మండల విద్యాధికారిగా బాధ్యతలు స్వీకరించిన లీలావతి, గతంలో అదనపు బాధ్యతలు స్వీకరించిన వెల్దుర్తి ఎంఈఓ యాదగిరిలను మంగళవారం పీఆర్‌టీయూ మండల నాయకులు సత్కరించారు. ఈ సందర్భంగా ఎంఈఓ కార్యాలయానికి గోడ గడియారాన్ని బహూకరించారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి నవీన్‌కుమార్, శ్రీశైలం, బ్రహ్మానందం నోడల్ అధికారి ధర్మపురి తదితరులు పాల్గొన్నారు.

◆ ఈజీఎస్ గ్రామసభలు

పెద్దశంకరంపేట(మెదక్): మండలంలోని ఆయా గ్రామాల్లో ఉపాధిహామీ గ్రామసభలు కొనసాగుతున్నాయి. మంగళవారం మండల పరిధిలోని బుజ్రాన్ పల్లి, మల్కాపూర్, శివాయిపల్లి గ్రామాలలో డీఆర్‌పీలు, ఎస్‌ఆర్‌పీలు గతంలో జరిగిన ఉపాధిహామీ పనులపై గ్రామసభలో వివరాలు సేకరించారు.

ఆలయాల్లో కార్తీక పూజలు



హోమం వద్ద పూజలు చేస్తున్న సాయి భక్తులు

వెల్దుర్తి(తూప్రాన్): హరి హరులకు కార్తీకమాసం ఎంతో పరమ పవిత్రమాసమని ఎమ్మెల్యే సునీతారెడ్డి అన్నారు. కార్తీక శుద్ధ ఏకాదశి పురస్కరించుకొని మాసాయిపేటలో మరకతలింగ సహిత రుక్మిణీ పాండురంగస్వామి దేవాలయంలో ఆలయ నిర్వాహకులు హరిరంజన్‌శర్మ, రఘు శర్మల ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక పూజల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఎమ్మెల్యే వెంట మాజీ సర్పంచ్‌లు నాగరాజు, నర్సింలు నాయకులు శ్రీనివాస్‌నాయక్, పవన్‌కుమార్ తదితరులు ఉన్నారు.

వైభవంగా సాయిబాబా ఆలయ వార్షికోత్సవం

వెల్దుర్తి(తూప్రాన్): మండల కేంద్రం మాసాయిపేటలో శ్రీలక్ష్మీగణపతి, దత్తాత్రేయ, ఆంజనేయ సహిత సాయినాథ ఆలయ తొమ్మిదో వార్షికోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విఘ్నేశ్వర పూజ, స్వస్తిపుణ్యాహవచనం, రక్షాబంధనం, పంచగవ్యప్రాశన, ఋత్విక్‌వరణం, యాగశాల ప్రవేశం, అఖండ దీపారాధన, నవగ్రహ వాస్తు యాత్మక యోగిని క్షేత్రపాల గణపతిహోమం నిర్వహించారు. సాయంత్రం సమయంలో గ్రామంలో పల్లకీసేవ చేశారు.

తప్పులు లేకుండా సర్వే చేయాలి



శివ్వంపేట(నర్సాపూర్): చిన్నగొట్టిముక్కలో సర్వేను పరిశీలిస్తున్న ప్రత్యేక అధికారి

శివ్వంపేట(నర్సాపూర్): ఇంటింటి సర్వే తప్పులు లేకుండా చేయాలని మండల ప్రత్యేక అధికారి ప్రతాప్‌సింగ్ సిబ్బందికి సూచించారు. మండల పరిధిలోని చిన్నగొట్టిముక్క, ఎదుల్లాపూర్ గ్రామాల్లో ఇంటింటి సర్వేని మంగళవారం పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీఓ తిరుపతిరెడ్డి, సిబ్బంది ఉన్నారు.

కుటుంబ సభ్యులు సహకరించాలి

చిలప్‌చెడ్(నర్సాపూర్): గ్రామాల్లో ఇంటింటి సర్వే నిర్వహించే ఎన్యుమరేటర్లకు కుటుంబసభ్యులు సహకరించాలని ఎంఈడీఓ ఆనంద్ అన్నారు. మంగళవారం ఆయన మండలంలోని అంతారం గ్రామ పరిధిలోని జైరాం తండాలో కొనసాగుతున్న సమగ్ర ఇంటింటి సర్వేను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీఓ శరత్‌కుమార్ ఉన్నారు.

మాద్వెట్‌పల్లిలో..

పెద్దశంకరంపేట(మెదక్): మండలంలో సమగ్ర కుటుంబ సర్వే చురుకుగా కొనసాగుతోంది. మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో ఎన్యుమరేటర్లు ఇంటింటికి వెళ్లి ప్రజల వివరాలను సేకరిస్తున్నారు. సర్వేను తహసీల్దార్ గ్రేస్‌బాయి, ఎంపీడీఓ రఫీఖ్‌ఉన్నీసా, డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్, ఆర్ఐలు పర్యవేక్షిస్తూ ఎన్యూమరేటర్లకు సర్వేలో తప్పులు లేకుండా చూడాలని అవగాహన కల్పిస్తున్నారు.

666 కుటుంబాల సర్వే

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని వివిధ గ్రామాల్లో 666 కుటుంబాలను సర్వే చేసినట్లు ఎంపీడీఓ శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా మండలంలోని భుజిరంపేట, పీర్యతండాలలో సర్వేను పరిశీలించారు. ఎన్యూమరేటర్లు సర్వేను తప్పులు లేకుండా ముమ్మరంగా చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాజిరెడ్డి, బలరాం, గ్రామస్తులు పాల్గొన్నారు.

అర్జునరావు సేవలు మరువలేనివి



తునికి విజ్ఞానజ్యోతిలో డైరెక్టర్ అర్జునరావును సన్మానిస్తున్న చైర్మన్ తదితరులు

కౌడిపల్లి(నర్సాపూర్): విజ్ఞానజ్యోతి డైరెక్టర్ అర్జునరావు సేవలు మరువలేనివని విజ్ఞానజ్యోతి సొసైటీ అడ్వైజరీ కమిటీ చైర్మన్ అచ్యుతరాంప్రసాద్ తెలిపారు. మంగళవారం మండలంలోని తునికివద్ద గల డాక్టర్ డి. రామానాయుడు విజ్ఞానజ్యోతి గ్రామీణాభివృద్ధి విద్యాసంస్థ వ్యవసాయ కళాశాలలో విధులు నిర్వహించిన డైరెక్టర్ పదవీ విరమణ సందర్భంగా అర్జునరావు, రాజ్యలక్ష్మి దంపతులకు సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 14 ఏళ్లుగా ఇక్కడ విధులు నిర్వర్తించి విద్యార్థులు, విజ్ఞానజ్యోతి అభివృద్ధికి ఎంతో కృషి చేశాడని తెలిపారు. కార్యక్రమంలో డైరెక్టర్ దేవేందర్‌రెడ్డి, ఫీల్డ్‌మేనేజర్ జగదీష్, ఎస్ఐ రంజిత్‌రెడ్డి, టమాటరైతు మహిపాల్‌రెడ్డి, శ్రీను, ఏఈఓ రాజశేఖర్‌గౌడ్, ఉపాధ్యాయులు, కేవీకే శాస్త్రవేత్తలు, వివిధ గ్రామాల రైతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలి



వెల్దుర్తి(తూప్రాన్): నిరసన వ్యక్తం చేస్తున్న తహసీల్దార్ కృష్ణ, సిబ్బంది



నర్సాపూర్ మండల తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న తహసీల్దార్, సిబ్బంది



రేగోడ్(మెదక్): నిరసన తెలుపుతున్న తహసీల్దార్ నరేశ్, సిబ్బంది

నర్సాపూర్: వికారాబాద్ జిల్లాలో కలెక్టర్, రెవెన్యూ ఉద్యోగులపై దాడి ఘటన నిరసిస్తూ రెవెన్యూ ఉద్యోగులు నిరసన వ్యక్తం చేశారు. పట్టణంలోని తహసీల్దార్ శ్రీనివాస్‌తో పాటు కార్యాలయ సిబ్బంది నల్ల బ్యాడ్జీలు ధరించి కార్యలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ మహేశ్, ఆర్ఐలు ఫైజల్, సిద్దీరాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చర్యలు తీసుకోవాలి

వెల్దుర్తి(తూప్రాన్): వికారాబాద్ జిల్లాలో కలెక్టర్, రెవెన్యూ ఉద్యోగులపై దాడి ఘటన నిరసిస్తూ వెల్దుర్తి తహసీల్దార్ కార్యాలయం ఎదుట తహసీల్దార్, సిబ్బంది నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన చేశారు. దాడికి పాల్పడిన వారిపై క్రిమినల్ కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం, ప్రజలకు మధ్య వారధిగా పనిచేస్తున్న ఉద్యోగులపై దాడి చేయడం హేయమని, భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పటిష్ఠ చర్యలు తీసుకోవాలన్నారు. ఆందోళనలో తహసీల్దార్ కృష్ణ, గిర్దావర్ జయభారత్‌రెడ్డి, అసిస్టెంట్లు ప్రసాద్, హఫీజ, సిబ్బంది కృష్ణకుమార్, మౌనిక, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

అధికారులపై దాడి సరైంది కాదు

చిలప్‌చెడ్(నర్సాపూర్): భూసేకరణకు వెళ్లిన వికారాబాద్ కలెక్టర్, తహసీల్దార్, తదితర అధికారులపై దాడి చేయడం సరైంది కాదని తహసీల్దార్ ముసాద్దీక్ అన్నారు. మంగళవారం ఆయన, రెవెన్యూ సిబ్బందితో కలసి తహసీల్దార్ ఆవరణలో నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ సింధూజ, సిబ్బంది పాల్గొన్నారు.

అరెస్ట్ చేయాలి

కొల్చారం(నర్సాపూర్): మండల కేంద్రంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట నల్ల బ్యాడ్జీలను ధరించి నిరసన చేసినవారిలో తహసీల్దార్ గఫర్‌మియా, డిప్యూటీ తహసీల్దార్ నాగవర్ధన్, సిబ్బంది పాల్గొన్నారు.

రేగోడ్‌లో..

రేగోడ్(మెదక్): ఫార్మ సిటీ భూసేకరణలో భాగంగా ప్రజాభిప్రాయ సేకరణకు వెళ్లిన వికారాబాద్ జిల్లా కలెక్టర్, ప్రత్యేకాధికారి, తహసీల్దార్‌పై జరిగిన దాడిని తహసీల్దార్ నరేశ్ ఖండించారు. ఇందుకు తహసీల్దార్ కార్యాలయం ఎదుట మంగళవారం నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. కలెక్టర్, పలువురు అధికారులపై దాడి చేయడం అమానుషమని చెప్పారు. కార్యక్రమంలో ఆర్ఐ ఫెరోజ్, సిబ్బంది పాల్గొన్నారు.

వలస కార్మికులకు న్యాయం చేయాలి



మాట్లాడుతున్న కామారం తండా ప్రజాప్రతినిధులు

చిన్నశంకరంపేట(మెదక్): బతుకుదెరువు కోసం వలస వచ్చి మృతి చెందిన ఝార్ఖండ్ రాష్ట్రానికి చెందిన కార్మికుల కుటుంబాలకు న్యాయం చేయాలని మండలంలోని కామారం తండా ప్రజాప్రతినిధులు, నాయకులు కోరారు. మంగళవారం వారు మాట్లాడుతూ.. ఎలాంటి అనుమతులు లేకుండా కోళ్లఫారం పనులు నిర్వహించిన యజమాని ఇప్పటి వరకు బాధితుల వద్దకు రాలేదన్నారు. గోడ కూలి ఇద్దరు యువకులు మృతి చెందగా, మానవత్వంతో స్పందించాల్సిన కోళ్లఫారం నిర్మాణ యజమాని పత్తలేకుండా పోవడం దారుణమన్నారు. పోలీసులు జోక్యం చేసుకొని యజమానిని పిలిపించి, మృతుల శవపంచనామ నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కామారం మాజీ ప్రజాప్రతినిధులు రాములు నాయక్, మున్యానాయక్, మోహన్‌నాయక్, రవిచంద్, గణేశ్, రవిందర్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.